ఇంకెన్నాళ్లీ 'కట్ట'కట?

- సమస్యే లేదంటున్న ప్రభుత్వం
- అన్నదాతలకు తప్పని పడిగాపులు
- అరకట్ట కోసం క్యూలు కడుతున్న వైనం
- పీఏసీఎస్‌ల వద్ద తోపులాటలు, వాగ్వాదాలు

యూరియా కోసం కొనసాగుతున్న రైతుల పాట్లు



ఉప్పలూరు సొసైటీ వద్ద యూరియా కట్టల స్లిప్పుల కోసం గుమిగూడిన రైతులు

కంకిపాడు: యూరియా కొరత సమస్య రైతులను వెంటాడుతూనే ఉంది. యూరియా కట్ట కోసం రైతులు క్యూ కడుతున్నారు. పీఏసీఎస్‌ల వద్ద కట్టల కోసం తోపులాటలు, గంటల కొద్దీ నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంటోంది. యూరియా అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నా, యూరియా అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారంటే కూటమి ప్రభుత్వ ప్రచారంలో వాస్తవం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

సొసైటీల వద్ద పడిగాపులు..

పీఏసీఎస్‌లకు యూరియా స్టాకు రావటంతో అధికారులు వచ్చి, స్లిప్పులు పంపిణీ చేసే వరకూ యూరియా సరఫరా జరగకపోవటంతో రైతులు సొసైటీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. అధికారులు వచ్చిన తర్వాత ఒక్కో రైతుకు ఎకరాకు అరకట్ట చొప్పున గరిష్టంగా మూడు కట్టలు చొప్పున మాత్రమే పంపిణీ చేస్తూ స్లిప్పులు అందజేశారు. బుధవారం మండలంలోని ఉప్పలూరు, పునాదిపాడు, మంతెన, కోలవెన్ను, తెన్నేరు, ప్రొద్దుటూరు, నెప్పల్లి సొసైటీలకు 15 టన్నులు చొప్పున, గొడవర్రు, మద్దూరుకు 10 టన్నులు యూరియా వచ్చింది. సమాచారం తెలుసుకున్న రైతులు ఒక్కసారిగా ఆయా సొసైటీలకు చేరుకోవటంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. పంట పొలాలు చిరుపొట్ట దశకు చేరుకోవటంతో ఈ దశలో యూరియా అందించాలని, అదును తప్పితే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు చెబుతున్నారు. సమస్యను అధిగమించేందుకు రైతాంగం యూరియా కోసం సొసైటీల వద్ద క్యూలు కట్టారు. ఉప్పలూరు, గొడవర్రు సొసైటీల వద్ద స్లిప్పులు కోసం రైతులు పోటీ పడటంతో ఒకానొక దశలో రైతుల మధ్య తోపులాటలు, వాగ్వాదం చోటుచేసుకున్నాయి. సొసైటీలకు యూరియా నిల్వలు వచ్చినా అదికూడా అరకొరగానే పంపిణీ జరిగిందని, పూర్తి స్థాయిలో యూరియా అందలేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు అరకట్ట యూరియా సరిపోదని, కట్ట సరఫరా చేస్తే మేలు జరుగుతుందని కోరుతున్నారు.



కోలవెన్నులో జిల్లా వ్యవసాయాధికారి పద్మావతికి యూరియా కొరతను వివరిస్తున్న రైతులు

అధికారుల పర్యటన..

మండలంలోని సొసైటీల్లో జరుగుతున్న యూరియా పంపిణీ తీరును జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి, విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు పరిశీలించారు. కోలవెన్ను, ఉప్పలూరు, గొడవర్రు, పునాదిపాడు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎకరాకు కట్ట చొప్పున యూరియా పంపిణీ చేయాలని కోరారు. అదును పోక ముందే పంటకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందించాలని, రైతుల అవసరాలను గుర్తించి ఎరువులు అందించాలని విన్నవించారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి మాట్లాడుతూ రైతుల అసరాల మేరకు ఎరువులు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పర్యటనలో మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబంలో ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండాలి



గన్నవరం: కుటుంబంలో ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి టి.శివరామప్రసాద్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం శివరామప్రసాద్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 1,200 ఓట్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 41 ఉన్నాయని శివరామప్రసాద్ తెలిపారు. పెరిగిన ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కొత్తగా 20 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పంపిన ప్రతిపాదనలను జిల్లా స్థాయిలో ఆమోదం పొందిందన్నారు. మరో 12 పోలింగ్ కేంద్రాల మార్పులు, నాలుగు పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చిడి ప్రతిపాదనలకు ఆమోదించినట్లు చెప్పారు. కుటుంబంలో ఓటర్లు మొత్తం ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా కరెక్షన్స్ చేయడంపై చర్చించారు. కేసరపల్లి శివారులోని ఎస్ఎల్‌వీలో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై కూడా ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ కె.వెంకటశివయ్య, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ లోడు క్రమబద్ధీకరించుకోవాలి



పెనమలూరు: విద్యుత్ లోడును వినియోగదారులు క్రమబద్ధీకరించుకోవాలని విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి అన్నారు. పెనమలూరు సెక్షన్‌లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. 37 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేసి 102 కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం రూ.3.76 లక్షలు విధించారు. ఈఈ మాట్లాడుతూ.. విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని సూచించారు. ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు, డీఈ బి.నవీన్‌కుమార్, పెనమలూరు ఏఈ ఆర్.సూర్యనారాయణ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై ప్రజలకు అవగాహన

గన్నవరం: మండలంలోని తేలప్రోలు గ్రామంలో బుధవారం ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌పై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పథకమైన ఆయుష్మాన్ భారత్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా ఆస్పత్రుల్లో అందించే ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య కార్డు పొందే విధానం, ఆరోగ్య బీమా ప్రయోజనాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీహరిబాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని అవగాహన కార్యక్రమం చేపట్టామన్నారు.

కో ఆపరేటివ్ సొసైటీ ఆర్వో ప్లాంట్ పునఃప్రారంభించాలి



నున్న(విజయవాడరూరల్): నున్న వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కోటకట్ట సెంటర్ వద్ద నిర్వహించే ఆర్వో ప్లాంట్‌ను పునఃప్రారంభించాలని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, నాయకులు కోరారు. ఈ మేరకు సొసైటీ సీఈవో టి.రమేష్ బాబును బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. సొసైటీ త్రిమెన్ కమిటీ పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆర్వో ప్లాంట్ మూతవేసి ఉండటం వలన వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు తిరిగి ప్రారంభించాలని వారు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రత్తిపాటి రవీంద్ర, పంచాయతి వార్డు సభ్యుడు ప్రత్తిపాటి సుందరయ్య, మాజీ ఏఎంసీ సభ్యుడు దండు సుబ్రహ్మణ్యం రాజు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): మండలంలోని నందమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఉంగుటూరు సెక్షన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం వేమండ, ఇందుపల్లి గ్రామాల్లోని వ్యవసాయ కనెక్షన్లకు గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గన్నవరం సెక్షన్ పరిధిలో..

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పి.హరిబాబు తెలిపారు. పామర్తినగర్, రావణమ్మ చెరువు, రాజీవ్‌నగర్, ఎస్టీబీఎల్ కాలనీ, శ్రీమల్లికార్జున హైస్కూల్ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కంటి సమస్యలు నిర్లక్ష్యం చేయరాదు

గన్నవరంరూరల్: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని ప్రముఖ కంటి వైద్యురాలు డాక్టర్ ప్రజ్ఞ పలగాని అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం గ్రామాల్లో రైజ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు ఉయ్యూరు శారద ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. 76 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని ఓ అపార్టుమెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా కార్యకలాపాలు సాగిస్తున్న వ్యభిచార గృహంపై బుధవారం పటమట పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని అంకిత అపార్టుమెంట్‌లోని ఓ ప్లాట్‌లో కొన్ని రోజులుగా వ్యభిచారం జరుగుతోంది. కొత్త వారు ఈ ప్లాట్‌కు తరుచూ రావడాన్ని గమనించిన స్థానికులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ పవన్‌కిశోర్ సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు మహిళలు, ఇద్దరు మహిళా నిర్వాహకులు, ఒక విటుడు పట్టుబడ్డారు. వీరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలి



కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



వణుకూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సులోచనరాణి



కాటూరు జెడ్పీ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రావణి

పెనమలూరు: కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో కె.బేబీసుకన్య తెలిపారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆడపిల్లల పెరుగుదలలో వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమంలో వచ్చే మార్పులు తెలుసుకోవాలని సూచించారు. కిశోర బాలికలు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పొందాలన్నారు. కిశోర బాలికలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత ఉంటే వెంటనే ఆహారం, మందులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, హెచ్ఎం సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వణుకూరులో..

వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సులోచనరాణి మాట్లాడుతూ ఆరోగ్య పోషణపై అవగాహన ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. విటమిన్లు, ప్రొటీన్, ఖనిజాలు, కార్బోహైడ్రేట్, కొవ్వు పదార్థాలు తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఆకుకూరలు, చిక్కిలు తినాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రఘురామ్, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కాశేశ్వరిదేవి, ఎం.రేవతి, పి.అనిత, పి.రంగమ్మ, కె.శిరీష, కె.శ్రీలేఖ, వి.జ్యోతి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఆహార భద్రతతోనే ఆరోగ్య భద్రత..

ఉయ్యూరురూరల్: ఆహార భద్రతతోనే ఆరోగ్య భద్రత సాధ్యమని కాటూరి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శ్రావణి అన్నారు. మండలంలోని కాటూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ బాలికలు, మహిళలు రక్తహీనత బారిన పడకుండా తగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆహార జాగ్రత్తలు ఆరోగ్య భద్రతకు దోహదపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా ఉండవచ్చన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సీజన్‌లో అందుబాటులో ఉండే పండ్లను, కూరగాయలను, ఆకుకూరలను, మాంసం కృతులు, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 10 రోజులు పాటు జరుగుతున్న అవగాహన కార్యక్రమాలను విద్యార్థినులు, యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శ్రావణి కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజినీ, కాటూరు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి మేరీ హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

కంకిపాడు: సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ వసుంధర, ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కె.బేబీసుకన్య అన్నారు. హెల్త్ ఎంపర్‌మెంట్, వెల్ఫేర్ 10 రోజుల అవగాహనా కార్యక్రమంలో భాగంగా పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ వసుంధర, బేబీ సుకన్య మాట్లాడుతూ పునరుత్పత్తి వ్యవస్థ, హెచ్‌బీ, హెచ్‌పీవీ వ్యాక్సిన్ల గురించి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని, పోషకాలు అధికంగా గల ఆహారం తీసుకోవటం ద్వారా వ్యాధులు దరిచేరవని సూచించారు. బాలికా విద్య, మహిళా సాధికారత అంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఏ.వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.అన్నామణి, షేక్ రెహనాబేగం, ఎంఎల్‌హెచ్‌పీ వినోదిని, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అనగాని

గన్నవరం: రైతులకు అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూరియా కొరత వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా పీఏసీఎస్‌ల్లో పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మండలంలో 8 వేల హెక్టార్ల పంటలకుగాను ఇప్పటి వరకు 1,100 టన్నుల యూరియా పంపిణీ చేశారని, మరో 2,400 టన్నులు రావాల్సి ఉందని తహసీల్దార్ కె.వెంకటశివయ్య తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని దశలవారీగా యూరియా సరఫరా చేస్తామన్నారు. మండలంలో ఖాళీగా ఉన్న విద్యుత్ లైన్‌మెన్ల పోస్టులను భర్తీ చేయాలని సర్పంచ్‌లు కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పీఏసీఎస్‌ల్లో యూరియా పంపిణీపై ముందుగా రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీలు కొమ్మరాజు సుధీర్, సాతులూరి శివనాగరాజకుమారి, ఎంపీడీఓ టి.స్వర్ణలత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



గన్నవరంలో మాట్లాడుతున్న కాట్రగడ్డ

గన్నవరం: రైతుల ఖరీఫ్ అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతుందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం రైతు సంఘ నాయకులు గొంది శోభనచలపతి రావు, నూతక్కి రామ్మోహన్‌రావుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతులకు సరైనా సమయంలో యూరియా సరఫరా చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరి పైరు వేసి 40 రోజులు గడుస్తున్న యూరియా చల్లకపోతే పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొందని చెప్పారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకుండా ఎక్కడ యూరియా కొరత లేదని అధికారులతో చెప్పిస్తుండడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూరియా బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి రైతులందరికీ సకాలంలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంక్‌లు పంట రుణాల మంజూరు చేయకపోవడం వల్ల కౌలు రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఎదుర్కోవాలి



డాక్టర్ దూబేను సత్కరిస్తున్న ఉప కులపతి వెంకటేశ్వరరావు తదితరులు

పెనమలూరు: సైబర్ సెక్యూరిటీ సవాళ్లను అధిగమించాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దుర్గాదూబే అన్నారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో బుధవారం సీఎస్ఈ, ఐటీ విభాగాల ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. బ్యాంకింగ్ రంగం, జాతీయ ఆర్థిక వ్యవస్థ, గ్లోబల్ డిజిటల్ మౌళిక వసతులలో సైబర్ సెక్యూరిటీకి చాలా ప్రాధాన్యత ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ బిల్ ఆఫ్ మెటీరియల్స్(ఎస్‌బీవోఎం) పారదర్శకత, సీఐఏ ట్రిడ్ సమాచార భద్రత, ఎండ్ ఆఫ్ లైఫ్(ఈవోఎల్) ద్వారా టెక్నాలజీ రిస్క్ ప్రాధాన్యతను వివరించారు. రాబోయే సైబర్ సెక్యూరిటీ సవాళ్లను ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యంతో ఎదుర్కోవాలని తెలిపారు. ఈ సందర్భంగా దూబేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప కులపతి ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రో.ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవిచంద్, సీఎస్ఈ, ఐటీ విభాగాధిపతులు డాక్టర్ డి.రాజేశ్వరరావు, డాక్టర్ ఎం.సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



డీవైఈఓ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

గన్నవరం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గుడివాడ డీవైఈఓ కొండా రవికుమార్‌కు బుధవారం యూటీఎఫ్ మండల శాఖ తరుపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మరీదు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన సేవా పుస్తకంలో నమోదులను సకాలంలో చేయాలన్నారు. ఏకోపాధ్యాయులు ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు వేరే ఉపాధ్యాయులను పంపించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల జీతాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వేసవి సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులను సేవా పుస్తకంలో నమోదు చేయాలన్నారు. విద్యార్థులు పెరిగిన పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని, సకాలంలో ఏఏఎస్‌లను మంజూరు చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించాలని చెప్పారు. సంఘ నాయకులు జీవీ రవిబాబు, దాసరి శివప్రసాద్, తాత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.70 కోట్ల ఆర్థిక సంఘం నిధుల విడుదల

విజయవాడరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబాపురం గ్రామానికి రూ.4.51 లక్షలు, ఎనికేపాడుకు రూ.16.43 లక్షలు, గూడవల్లికి రూ.10.84 లక్షలు, కొత్తూరు తాడేపల్లికి రూ.12.09 లక్షలు, నిడమానూరుకు రూ.22.15 లక్షలు, నున్న గ్రామానికి రూ.27.45 లక్షలు, పి.నైనవరం గ్రామానికి రూ.4.97 లక్షలు, పాతపాడుకు రూ.7.01 లక్షలు, ప్రసాదంపాడుకు రూ.20.84 లక్షలు, పైడూరుపాడుకు రూ.5.20 లక్షలు, రామవరప్పాడుకు రూ.31.31 లక్షలు, రాయనపాడు గ్రామానికి రూ.7.20 లక్షలు విడుదలైనట్లు ఎంపీడీఓ చెప్పారు.

16న హుండీ కానుకల లెక్కింపు


పెనమలూరు: యనమలకుదురు లాకులు వద్ద వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 16న హుండీ కానుకల లెక్కింపు చేపడతామని ఆలయ ఈవో ప్రసాదరావు తెలిపారు. 16న ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తలి మండలి సభ్యులు, దేవదాయ శాఖాధికారుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండేళ్ల కాల పరిమితికి కొబ్బరి చిప్పల బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

15న మహాధర్నాను జయప్రదం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 15వ తేదీన విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్ కోరారు. హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం ఉదయం భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద మహాధర్నా కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ ఎన్నికల హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 మాసాలు గడుస్తున్నా సంక్షేమ బోర్డు, బిల్డింగ్ వర్కర్స్ సమస్యలపై దృష్టి పెట్టకపోవటం శోచనీయమన్నారు. ఇప్పటికే పలుమార్లు కార్మికశాఖ ఉన్నతాధికారులు, కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించిన స్పందన లేదని రాజనాల వాపోయారు. మహాధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజులపాటి కొండలు, వడ్డి గిరిధర్, కాకాని సాంబశివరావు, రాము, నాగళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్వాంటమ్ వ్యాలీ హ్యాక్‌థాన్‌తో సాంకేతిక పరిజ్ఞానం పెంపు

జేఎన్‌టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఉపకులపతి ప్రసాద్ తదితరులు

పెనమలూరు: క్వాంటమ్ వ్యాలీ హ్యాక్‌థాన్‌తో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జేఎన్‌టీయూ కాకినాడ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే.ప్రసాద్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో బుధవారం అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాక్‌థాన్ 2025 సెమీ ఫైనల్స్ కార్యక్రమాన్ని ఉపకులపతి ప్రారంభించి ప్రసంగించారు. క్వాంటమ్ హ్యాక్‌థాన్ కేవలం పోటీలే కాదని, కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి వేదికన్నారు. రానున్న కాలంలో క్వాంటమ్ టెక్నాలజీ, ఏఐ, డీప్ టెక్ రంగాల్లో విశేష అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఆదిత్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎంబీ.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనటం వలన మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన జట్లకు రూ.1.50 లక్షల విలువైన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ రవిప్రసాద్, కార్యదర్శి భవానీప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, 30 కాలేజీల విద్యార్థులు, నిపుణులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలకు మానవత వితరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని ఆదిత్య బధిరుల పాఠశాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.10 వేలు విరాళాన్ని బుధవారం అందజేశారు. మానవత సభ్యులు, విశ్రాంత సర్వేయర్ జీవీకే నారాయణ మనవడు డాక్టర్ దీపక్‌కు ఇటీవల పీజీ ఎంట్రన్స్ టెస్ట్‌లో ఎంఎస్ సీటు దక్కటంతో ఆర్థికసాయం అందించారు. మానవత రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా నగదును ఆదిత్య బధిరుల పాఠశాల కరస్పాండెంట్ ఆకుల వెంకట రమణకు అందజేశారు. మానవత సభ్యులు ప్రాబోలు గణేష్, గంటా ఇందిరా దేవి, రాజేశ్వరరావు, సుబ్బారావు, మరీదు వెంకటస్వామి, గోళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా గణపతి ఉత్సవాలు నిర్వహణ



గన్నవరం: ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా జిల్లాలో గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి జిల్లా శాఖ అధ్యక్షుడు కేహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం గన్నవరంలో గణేష్ ఉత్సవ సమితి జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆగస్టు 10న ఏర్పడిన గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలను శోభాయమానంగా నిర్వహించేందుకు అన్ని రకాల సహకారం అందించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి గణేష్ మండపాలకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు, ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేశామని చెప్పారు. రానున్న రోజుల్లో గణేష్ ఉత్సవ సమితి నియోజకవర్గ, మండల కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సనాతన ధర్మాన్ని మరింత విస్తరించేందుకు గణేష్ ఉత్సవ సమితి పని చేస్తోందని రాష్ట్ర కమిటీ సభ్యుడు కోనేరు దుర్గాప్రసాద్ తెలిపారు. సమితి జిల్లా కార్యదర్శి మణిందర్‌నాథ్, ఉపాధ్యక్షులు బసవశంకరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.